టూటౌన్.. వెల్‌డన్..

- నేరగాళ్లపై నిరంతర నిఘా
- శాంతిభద్రతల పరిరక్షణలో కీలకం
- గంజాయి, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం
- పోలీస్ స్టేషన్ సిబ్బంది పనితీరు ఆదర్శనీయం



రాజమహేంద్రవరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్

కంబాలచెరువు: సాంస్కృతిక రాజధాని అయిన రాజమహేంద్రవరానికి నిరంతరం అనేక మంది ప్రజలు వస్తుంటారు. ఇక్కడ చారిత్రక గుర్తులతో పాటు వ్యాపార వాణిజ్యాల జోరుగా ఎక్కువగా ఉంటుంది. నగరంలో అనేక ప్రముఖ ఆస్పత్రులు, విద్యాలయాలు ఉన్నాయి. ఇక్కడ హోల్ సేల్ వస్త్ర దుకాణాలకు ఇతర జిల్లాల నుంచి వ్యాపారులు, ప్రజలు తరలివస్తారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు, ప్రజలు రాజమహేంద్రవరం ప్రవేశ ద్వారమైన కోటిపల్లి బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో దిగుతారు. అక్కడి నుంచి నగరంలో వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారు. ఈ నేపథ్యంలో ఈ రెండు ప్రదేశాలూ భద్రతాపరంగా ఎంతో కీలకంగా ఉంటాయి.

టూటౌన్ పోలీస్ స్టేషన్ కీలకం

ఎంతో కీలకమైన ఆ రెండు ప్రదేశాలూ టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్నాయి. వీటితో పాటు వైశాల్యం రీత్యా ఈ పోలీస్ స్టేషన్ పరిధి చాలా ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి చోట శాంతిభద్రతల పర్యవేక్షణ కత్తిమీద సామే. అయితే జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్, అధికారుల సమన్వయంతో విజయవంతంగా శాంతిభద్రతల పరిరక్షణ జరుగుతోంది. గతంలో కొట్లాటలకు, బ్లేడ్‌బ్యాచ్‌లకు, నేరగాళ్లకు నిలయంగా ఉండే ప్రాంతం ఇప్పుడు ప్రశాంత వాతావరణంలోకి మారింది. దీని వెనుక పర్యవేక్షణాధికారులతో పాటు స్టేషన్ సీఐ, సిబ్బంది పాత్ర ఎంతో ఉంది.

గంజాయి కేసులో..

టూటౌన్ స్టేషన్ పరిధిలో ఆల్కాట్ తోట, ఇన్నీసుపేట, నక్కలదొడ్డి, వీరభద్రపురం, బాలాజీపేట వంటి ప్రాంతాలు కీలకం. ప్రధాన రైల్వేస్టేషన్‌కు ఈ ప్రాంతాలు ఆనుకుని ఉండడంతో చోరీలకు పాల్పడే వ్యక్తులతో పాటు గంజాయి విక్రయాలు కూడా గతంలో ఉండేవి. ఇటీవల గంజాయి అమ్మకాలపై స్టేషన్ అధికారి ఉక్కుపాదం మోపారు. దీనిలో భాగంగా గంజాయి సేవించే వారిని విచారించి, వారి ద్వారా గంజాయి విక్రయం చేస్తున్న వారిని పట్టుకుని కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారు. ఇలా ఇటీవల మొత్తం 17 మంది గంజాయి వ్యాపారులపై కేసులు నమోదు చేసి కటకటాల వెనుక పెట్టారు.

బ్యాంకుల వద్ద భద్రత

జిల్లా పరిధిలో రైలు, బస్సు మార్గాలకు దగ్గర ఉన్న టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోనే మొత్తం 26 బ్యాంకింగ్ సంస్థలు ఉన్నాయి. దీనితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయి. ఇక్కడ నిత్యం కోట్లాది రూపాయల లావాదేవీలు జరుగుతుంటాయి. గతంలో బ్యాంకుల్లో నగలు తీసుకోవడానికి వచ్చే ఖాతాదారులను ఏమార్చి లక్షల రూపాయలను దొంగలు కొల్లగొట్టేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారింది. స్టేషన్ సిబ్బంది ప్రణాళికాబద్ధంగా నిరంతర గస్తీ నిర్వహించడంతో ఇది సాధ్యమైంది. గతంలో గోదావరి తీర ప్రాంతమైన గౌతమీ ఘాట్, రోడ్డు కం రైల్వే వంతెన ఆత్మహత్యలకు కేంద్రంగా ఉండేది. అక్కడ మహిళా సిబ్బందిని ఏర్పాటు చేయడంతో ఆత్మహత్యల నివారణ సాధ్యపడింది.

మహిళలకు రక్షణ

టూటౌన్ పరిధిలో ప్రభుత్వ జూనియర్, వీటీ, సంహిత తదితర కళాశాలలు ఉన్నాయి. ఇతర ప్రాంతాల నుంచి నగరానికి చదువు కోసం వచ్చే విద్యార్థులు కోటిపల్లి బస్టాండ్‌లో దిగుతుంటారు. వీరిని ఆకతాయిలు వేధించకుండా కళాశాల ప్రారంభం, ముగింపు సమయాల్లో మహిళా రక్షక్‌తో గస్తీ ఏర్పాటు చేస్తుండడంతో వేధింపులు తగ్గాయి.

సిబ్బంది కృషితోనే సాధ్యం



టూటౌన్ పరిధిలో సీసీ కెమెరాలను పటిష్టం చేశాం. రైల్వే స్టేషన్ వద్ద పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశాం. నిరంతర గస్తీ ఏర్పాటు చేసి సత్ఫలితాలు సాధిస్తున్నాం. శాంతిభద్రతల పరిరక్షణలో ఎక్కడా రాజీ పడడం లేదు. ఫిర్యాదు అందిన 10 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకునేలా సిబ్బందిని ప్రణాళికబద్ధంగా ఉపయోగిస్తున్నాం. బ్లేడ్ బ్యాచ్, గంజాయి పొట్లాల విక్రయాలు కలిపే ఆకతాయి యువకులపైనా కేసులు నమోదు చేస్తున్నాం. నేరాలను నియంత్రణకు పోలీసు సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారు.

– కె.మంగాదేవి, ఇన్‌చార్జి టూటౌన్ సీఐ, రాజమహేంద్రవరం

అగ్నికుల క్షత్రియ సంఘ సంక్షేమానికి కృషి


ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: సంఘ సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని రాజమహేంద్రవరం గోదావరి అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘ నూతన అధ్యక్షుడు ఆకుల భైరవస్వామి అన్నారు. ఆ సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భైరవస్వామి మాట్లాడుతూ గోదావరిలోని ఎదుర్లమ్మ లంక, ధవళేశ్వరం లంక, ఆల్కాట్ తోట లంక, పాత బ్రిడ్జి చిన్న లంక, పెద్దలంక, కొత్త లంక గ్రామాల్లో 2 వేల మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారన్నారు. గత పాలకవర్గం సుమారుగా దశాబ్దం పాటు పనిచేసిన నేపథ్యంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నామన్నారు. కాగా.. సంఘ ప్రధాన కార్యదర్శిగా పాలేపు రామానందం, కోశాధికారిగా మల్లాడి రమణ, కర్రి బ్రహ్మాజీ, కార్యవర్గ సభ్యులుగా పెమ్మాడి శ్రీను, నాటి బ్రహ్మాజీ, కర్రి పోశయ్య, నాటి బాలయోగి, నాటి నాగరాజు ఎన్నికయ్యారు.

వ్యాసరచనలో ఎస్‌కేవీటీ విద్యార్థినుల ప్రతిభ


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని పి.తేజస్విని ప్రథమ, తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎం.సాధిక తృతీయ బహుమతి సాధించారు. వీరికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాయని లతా మంగేష్కర్‌కు నివాళి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రపంచం గర్వించదగిన మహా గాయని లతా మంగేష్కర్ అని నట, గాయకుడు జిత్‌మోహన్‌మిత్ర కొనియాడారు. రాజమహేంద్రవరంలోని జిత్‌మోహన్‌మిత్ర కళావేదికపై గురువారం ఆయన అధ్యక్షతన లతా మంగేష్కర్ తృతీయ వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి జిత్‌మోహన్‌మిత్ర, ముద్రగడ ఏసుబాబు, నూజిళ్ల సూరిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


లతా మంగేష్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

గడ్డివాము దగ్ధం

కడియం: దుళ్ల గ్రామానికి చెందిన చిట్టూరి వెంకన్న చౌదరి (గెడ్డం చౌదరి)కి చెందిన గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి నిప్పు పెట్టారు. దీంతో పదెకరాల్లోని ఎండుగడ్డి పూర్తిగా కాలిబూడిదైపోయింది. సమీపంలోని కొబ్బరి మొక్కలు, పక్కనే ఉన్న నర్సరీ మొక్కలు సైతం మంటల ధాటికి దెబ్బతిన్నాయి. దాదాపు లక్ష రూపాయల వరకూ ఆస్తినష్టం జరిగి ఉంటుందని బాధితులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల కాలువ అభివృద్ధికి అడ్డుగా ఉన్న ఆక్రమణ తొలగింపులో గెడ్డం చౌదరి చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అతడిని భయపెట్టే ఉద్దేశంతోనే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని రైతులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న కడియం, మండపేట రూరల్, కొత్తపేట మండలాల పరిధిలోని పలువురు రైతులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. రైతు నాయకులు కొలుపోటి సత్యనారాయణమూర్తి, గొడవర్తి ఎర్రబ్బు, చిలుకూరి కృష్ణ, ముమ్మిడి దేవీ నాగేశ్వరరావు, పర్వతిని సుబ్బయ్య, యన్నమని సూరిబాబు, గంగరాజు తదితరులు బాధిత రైతును పరామర్శించారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రైతు నాయకులు

లంక భూములను పరిశీలించిన అధికారులు

సీతానగరం: మండలంలోని ముగ్గళ్ల ఇసుక ర్యాంపు నుంచి ప్రక్కిలంక రెవెన్యూలోని లంక భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, కొవ్వూరు ఆర్‌డీవో డాక్టర్ రాణి సుస్మిత గురువారం పరిశీలించారు. ముగ్గళ్ల ర్యాంపు నుంచి తాళ్లపూడి మండలం ప్రక్కిలంక రెవెన్యూలోని లంక భూముల పరిశీలనకు వెళ్లారు. లంక భూముల్లో వేసిన ఇసుకను తొలగించుకుంటామని పదకొండు మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సంబంధించి డీఎల్ఎస్ కమిటీలోని జేసీ చిన్నరాముడు, ఆర్డీవో డాక్టర్ సుస్మిత, తాళ్లపూడి తహసీల్దార్ పి.మోహన భారతి, ఆర్ఐ కె.రామకృష్ణ, మైన్స్ సర్వేయర్ శ్రీనివాస్ తదితరులు వాటిని పరిశీలించారు. ఆ రైతులకు సంబంధించిన 110 ఎకరాల లంకభూముల్లో ఇసుకను పరిశీలించారు. వారి వెంట కోరుకొండ ఏడీఏ మల్లికార్జునరావు, మైన్స్ ఏఈ మణికంఠరాజు ఉన్నారు.


లంక భూములను పరిశీలిస్తున్న అధికారులు

రైస్ మిల్లు తనిఖీ

రఘుదేవపురంలోని వెంకటేశ్వర మోడ్రన్ రైస్ మిల్లును జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు గురువారం తనిఖీ చేశారు. రైస్‌మిల్లు కెపాసిటీ ఎంత, మిల్లింగ్ ఎంత జరుగుతుంది,

ప్రభుత్వానికి కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఎంత అందించాలి, ఇంత వరకు ఎంత అందించారు అనే రికార్డులను పరిశీలించారు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంఎస్‌వో నాగలక్ష్మి ఉన్నారు.

10న నులి పురుగుల నివారణా దినోత్సవం



నులిపురుగుల నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నులి పురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాష్ట్రీయ బల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో గురువారం నులి పురుగుల నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం కింద కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 10వ తేదీన జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఫిబ్రవరి 10, 17 తేదీల్లో నులిపురుగుల నివారణ మాత్రలు అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజల సహకారంతో వందశాతం లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని 1556 అంగన్‌వాడీ కేంద్రాలు, 1,578 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ఇందులో బడి మానేసిన పిల్లలతో సహా ఒకటి నుంచి 19 ఏళ్లలోపు 4,30,339 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. లక్ష్యాన్ని సాధించే దిశగా వారందరికీ అల్బెండజోల్ మాత్రలు అందజేస్తామన్నారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం కింద జిల్లాలో 2024 ఆగస్టు నుంచి డిసెంబర్ మధ్య 18 ఏళ్ల వయసున్న విద్యార్థులను స్క్రీనింగ్ చేయడం ద్వారా 3,500 మందికి కంటి సమస్యలున్నట్టు గుర్తించామన్నారు. వారందరికీ కళ్లజోళ్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ డాక్టర్ ఎన్.వసుంధర, పీడీ ఐసీడీఎస్ అధికారి కె.విజయ కుమారి, జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిచంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలోనూ మోడల్ ప్రైమరీ స్కూల్

ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్ లేకుండా హేతుబద్ధతతో కూడిన విధానంలో ప్రతి గ్రామంలోనూ మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయాలని విద్యాశాఖాధికారులకు కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. కొవ్వూరు, రాజమహేంద్రవరం డివిజన్లకు చెందిన అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఒక మోడల్ ప్రైమరీ పబ్లిక్ స్కూల్ ప్రతిపాదన అమలు చేయాలని, ఇందుకు సంబంధించి క్షేత్ర స్థాయిలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి ఎంఈఓ పాఠశాల సందర్శన చేయాలన్నారు. ఎంపీడీవో, మండల ప్రత్యేక అధికారులు కూడా డ్రాప్ అవుట్ అయిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించి, స్కూల్‌కు వచ్చేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాల విద్యా అధికారి కె.వాసుదేవరావు, ఎస్ఎస్ఏ పీడీ ఎస్.సుభాషిణి పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయక సేవలు అందించాలి


హబీబుల్లాఖాన్‌ను సత్కరిస్తున్న కానుబోయిన సాగర్

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేస్తూ, ముస్లిం సామాజిక వర్గానికి స్ఫూర్తిదాయకమైన సేవలు అందించాలని వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ నూతన అధ్యక్షుడు హబీబుల్లా ఖాన్‌కు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కానుబోయిన సాగర్ సూచించారు. వైఎస్సార్ సీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడుగా నియమితులైన హబీబుల్లాఖాన్‌ను గురువారం అజాద్ చౌక్‌లోని లబాబిన్ మసీదులో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర బీసీ సెల్ చైర్మన్ మజ్జి అప్పారావు, చోటా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈవెంట్స్ మీడియాతో ఆర్ట్స్ కళాశాల ఒప్పందం

కంబాలచెరువు: హైదరాబాద్‌లోని ఇండల్జెన్స్ ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ మీడియాతో స్థానిక ఆర్ట్స్ కళాశాల వాణిజ్య – మేనేజ్‌మెంట్ విభాగం గురువారం అవగాహనా ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ ఈ ఒప్పందంతో బీబీఏ (ఈవెంట్ మేనేజ్‌మెంట్) విద్యార్థులకు పరిశ్రమ అనుభవాన్ని అందించేందుకు శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్, ప్రచారం, బ్రాండ్ మార్కెటింగ్‌లో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామన్నారు. అనంతరం ఇండల్జెన్స్ ఈవెంట్స్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిపుణులు మాట్లాడుతూ పరిశ్రమలోకి వస్తున్న కొత్త ధోరణులు, వ్యూహాత్మక ప్రణాళిక, బడ్జెటింగ్, మార్కెటింగ్ వ్యూహాలు, కెరీర్ అవకాశాలను వివరించారు. బీబీఏ సమన్వయకర్త డాక్టర్ పి.సునంద, బీబీఏ ఈఎం ప్రోగ్రామ్స్ స్ట్రీమ్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.ప్రతిమ మాట్లాడారు. కార్యక్రమంలో వాణిజ్య – మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, డాక్టర్ పి.షణ్ముఖరావు, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ రామచంద్ర తదితరులు

కుక్కలకు ర్యాబిస్ నిరోధక టీకాలు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో కుక్కలకు ర్యాబిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేయాలని నిర్ణయించినట్లు కమిషనరు కేతన్ గార్గ్ గురువారం తెలిపారు. కుక్కల సంతతిని నియంత్రించేందుకు ప్రతి రోజు 30 కుక్కలకు శస్త్ర చికిత్సలు చేయిస్తున్నామని, వీటిని ఇంకా ఎక్కువ సంఖ్యలో చేయటానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రెండు నెలల కాలంలో సుమారు పదివేల కుక్కలకు టీకాలు వేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ ఎ.వినూత్న పర్యవేక్షిస్తారన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం


ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి

కడియం: దుళ్లలోని భూసమేత వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం అంకురార్పణ చేశారు. ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో 50 మందికి పైగా భక్తులు గోవింద మాలలు ధరించారు. వీరంతా బ్రహ్మోత్సవాలలో స్వామివారి సేవల్లో పాలుపంచుకుంటున్నారు. మాలలు ధరించిన వారంతా తెల్లవారుజామున ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మాల ధారణ చేశారు. అలాగే శుక్రవారం రాత్రి నుంచి స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు, రాత్రి 8 గంటలకు వాహన సేవలు జరుగుతాయి.

లంక భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు


అధికారులు సీజ్ చేసిన పొక్లెయిన్

కడియం: పొట్టిలంక శివారు గోదావరి లంక భూముల్లో లంక మట్టిని అక్రమంగా తరలించుకుపోతున్న జేసీబీ, లారీలను కడియం పోలీసులు సీజ్ చేశారు. వాటిని మైన్స్, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు బుధవారం అర్ధరాత్రి కడియం ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది ఈ దాడి చేశారు. అక్కడ మట్టిని తవ్వుతున్న జేసీబీ, తరలిస్తున్న లారీని సీజ్ చేశారు. తవ్వకాలకు కారణమెవరన్నదీ విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా.. కొన్నాళ్లుగా మట్టిని అక్రమంగా తరలించుకుపోతున్నప్పటికీ స్థానిక ప్రభుత్వ యంత్రాంగం కళ్లుమూసుకుని ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆర్టీసీ డిపోలో ఫ్యామిలీ కౌన్సెలింగ్


మాట్లాడుతున్న డిపో మేనేజర్ షేక్ షబ్నం

రాజమహేంద్రవరం సిటీ: డ్రైవర్లు ప్రశాంతమైన మనసుతో డ్యూటీకి రావాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, మంచి అలవాట్లు కలిగి ఉండాలని రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్నం అన్నారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు ప్రతి రోజూ వ్యాయామం, యోగా చేయాలన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యంతో ప్రమాద రహిత డ్రైవింగ్ చేయడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో మేనేజర్ అసిస్టెంట్ మేనేజర్ అజయ్ బాబు, ట్రాఫిక్, గ్యారేజ్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తనిష్క్ షోరూమ్ ప్రారంభోత్సవం


షోరూమ్‌ను ప్రారంభిస్తున్న వెంకటరామన్, చిత్రంలో గోలి రామారావు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: అధునాతన బంగారు, వజ్రాల ఆభరణాలకు పేరెన్నికగన్న తనిష్క్ షోరూమ్ శాఖను గురువారం తిలక్ రోడ్డులో ప్రారంభించారు. ఈ సందర్భంగా టైటాన్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సీకే వెంకట రామన్ మాట్లాడుతూ తనిష్క్ 35వ షోరూమ్‌ను రాజమహేంద్రవరం ప్రారంభించామన్నారు. ప్రారంభోత్సవంలో భాగంగా ప్రతి కొనుగోలుపై ఉచిత బంగారు నాణెం పొందవచ్చన్నారు. షోరూమ్ అధినేతలు గోలి రామారావు, గోలి జానకి నందన్ మాట్లాడుతూ ఈ ఆఫర్ ఫిబ్రవరి 6 నుంచి 8వ తేదీ వరకు ఉంటుందన్నారు.

కార్యక్రమంలో టైటాన్ సౌత్ రీజినల్ బిజినెస్ హెడ్ అజయ్ ద్వివేది, రాజమహేంద్రవరం రూరల్, సిటీ ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్, జీఎస్ఎల్ హాస్పిటల్ అధినేత గన్ని భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు వారాహీదేవి విగ్రహ ప్రాణప్రతిష్ఠ

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరులోని వారాహీదేవి పీఠం వ్యవస్థాపకులు పామర్తి బాబూరావు, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా శుక్రవారం ఉదయం 11.26 గంటలకు వారాహీదేవి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరగనుంది. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు పూర్ణాహుతితో ముగింపు నిర్వహిస్తారు. కాగా.. మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు.

స్థానిక ప్రజాప్రతినిధులకు బాధ్యతలు అప్పగించాలి

ప్రకాశం నగర్: గత పుష్కరాల్లో చోటుచేసుకున్న అవాంఛనీయ సంఘటనలు పునరావృతం కాకుండా ఈసారి నిర్వహించే గోదావరి పుష్కరాలకు స్థానిక ప్రజాప్రతినిధులకు కీలక బాధ్యతలు అప్పగించాలని రాష్ట్ర జలవనరుల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడుకు రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ సంఘం ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. రాజమహేంద్రవరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంత్రిని కలిసిన సంఘం అధ్యక్షుడు సానబోయిన రామారావు, రాష్ట్ర వైస్ చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు బి.జార్జి ఆంటోని తదితరులు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. సిటీ, రూరల్ ఎమ్మెల్యేలకు ఈ ప్రాంతం మీద పూర్తి అవగాహన ఉంటుందని, వారికి కేబినెట్ హోదా పదవులు కల్పిస్తే పుష్కరాల ఏర్పాట్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చూస్తారన్నారు. రాజానగరం, కొవ్వూరు ఎమ్మెల్యేలకు కీలక బాధ్యతలు అప్పగించాలని, నిడదవోలుకు ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానిక మంత్రి కందుల దుర్గేష్ కూడా పుష్కరాల ఏర్పాట్లు స్వయంగా పర్యవేక్షించే అవకాశం ఉంటుందన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ సీతారామమూర్తి

రాజమహేంద్రవరం సిటీ: తూర్పు, పశ్చిమ గోదావరి ద్వైవార్షిక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నోడల్ అధికారులు కృషి చేయాలని డీఆర్‌ఓ, సహాయ ఎన్నికల అధికారి టి.సీతారామమూర్తి, సూచించారు. ఆ ఎన్నికకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్‌లో నోడల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 27వ తేదీన జరిగే పోలింగ్‌కు సంబంధించి ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లాలో 92 పోలింగు కేంద్రాల పరిధిలో 63,441 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 750 నుంచి 1000 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఆ రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు.

చిన్నారులకు బాలామృతం పంపిణీ

రాజానగరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఇచ్చే బాలామృతం మరింత ఆరోగ్యవంతంగా ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని, జూనియర్, సీనియర్ బాలామృతం పేరుతో అందిస్తోందని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ తెలిపారు. బాలామృతంలో తాజాగా తీసుకువచ్చిన ఈ మార్పుల మేరకు తయారైన జూనియర్, సీనియర్ బాలామృతం పంపిణీ కార్యక్రమాన్ని మండలంలోని కానవరం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాలో కానవరం కేంద్రాన్ని పైలెట్ ప్రోగ్రామ్‌కు ఎంపిక చేశారని ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీఓ టి.కనకవల్లి చెప్పారు. ఇప్పటివరకూ అందించిన బాలామృతంలోని పంచదార, పాల పౌడర్లను తొలగించి, వేయించి వేరుశెనగను కలుపుతున్నారన్నారు. ఈ విధంగా తయారైన బాలామృతాన్ని ఏడు నెలల నుంచి ఒక ఏడాది వయసున్న చిన్నారులకు జూనియర్ బాలామృతం (1500 గ్రాములు,) ఒక ఏడాది నుంచి మూడేళ్ల వయసున్న చిన్నారులకు సీనియర్ బాలామృతం (2.500 గ్రాములు) అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్‌కే దుర్గామణి, కార్యకర్త కె.నాగమణి, పిల్లలు, వారి తల్లులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల : సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ : బడాస్ రవికుమార్
సూర్యప్యాలెస్ : పట్టుదల
స్వామి : సంక్రాంతికి వస్తున్నాం
శివజ్యోతి : తండేల్
అనుశ్రీ : ఒక పథకం ప్రకారం, మదగజరాజు
రాజా : తండేల్
ఊర్వశి : డాకు మహారాజ్
మేనక : గేమ్‌ఛేంజర్
రంభ : ఒక పథకం ప్రకారం, మార్కో
కుమారి : తండేల్
అప్సర : తండేల్
అశోక : పట్టుదల

నామవరం
వీఎస్ మహల్ : తండేల్

ధవళేశ్వరం
మురళీకృష్ణ : తండేల్

కడియం
వెంకటసూర్య : తండేల్